www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 28 ఏప్రిల్ 2023

విశిష్ట అతిథిగా విచ్చేసిన మినుబాజ్‌పాయ్ టిటిడి ఆస్పత్రుల్లో పరిశీలన

మహిళల ప్రత్యేక ఆటోస్టాండ్లలో... పురుష డ్రైవర్ల చొరబాటు

బాడుగలు దొరక్క 'మహిళలు' డ్రాపౌట్

కేంద్రంలోని బిజెపి నిత్యవసర ధరలు పెంచేయడం, రాష్ట్రంలోని వైసిపి పట్టించుకోకపోవడంతో మహిళలు సైతం రోడ్డెక్కక తప్పడం లేదు. నిత్యవసర ధరలకు తోడు. మద్యం వ్యసనమై కుటుంబాలు గడవని దుస్థితి. ఈ నేపథ్యంలో పురుషుల ఆదాయానికి వేణ్ణీళ్లకు చన్నీళ్లు తోడన్న చందంగా ప్రతి రంగంలోనూ మహిళలు రాణిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.. అలానే ఆటో రంగంలోనూ డ్రైవర్లుగా దూసుకుపోతున్నారు.. ప్రముఖ సేవా సంస్థ రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ద్వారా ఆటో తోలడంలో తర్ఫీదు తీసుకుని, శిక్షణ అనంతరం రాస్ ద్వారా ఆర్థిక భరోసాతో ఆటోలు కొనుగోలు చేసి నడుపుకుంటున్నారు. అయితే చిక్కంతా వీరికి ఆటోస్టాండ్‌ల వద్ద ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా తక్కువమంది మహిళలు ఆటో డ్రైవర్లుగా ఉన్నారు. అయితే వీరికి ప్రత్యేక స్టాండ్‌లు లేకపోవడంతో స్టాండ్‌ల వద్ద 'పురుషాధిక్యత' ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.. స్టాండ్‌ల్లో బాడుగలు వీరికి అరకొరగా వస్తున్నాయి. తిరుపతిలోని కొన్ని కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేకంగా ఆటోస్టాండ్‌లను ఏర్పాటు చేయాలని ఆటోడ్రైవర్లు కోరుతున్నారు.

15 మంది మహిళా డ్రైవర్లతో ప్రారంభమైన స్టాండ్‌లో నలుగురే మిగిలారు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతిలో మహిళలు ఆటోవాలా అవతారమెత్తి కుటుంబ పోషణకు తమవంతు సహకారం అందిస్తున్నారు. వీరి మనోబలాన్ని, దృఢనిశ్చయాన్ని గుర్తించిన ట్రాఫిక్ డిఎస్‌పి మహిళా అధికారి చొరవ చూపారు. తిరుపతి స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఆస్పత్రి వద్ద మహిళా ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా 15 మందితో ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. అలానే ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పద్మావతి సబ్‌వే వద్ద ప్రత్యేకంగా స్టాండ్‌లను ఏర్పాటు చేశారు. ఇంతవరకూ అంతా బాగానే ఉంది. మొదట్లో బాగానే ఉన్నా రానురాను వారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. మహిళా స్టాండ్‌ల్లోకి మగవారు దౌర్జన్యంగా ప్రవేశించడం ప్రారంభించారు. తమ అసోసియేషన్ల కిందనే పని చేయాలంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. స్టాండ్లలో ఆటోలు ఎక్కువ కావడంతో ఆడవారికి రోజు వచ్చే కిరాయి తగ్గుముఖం పట్టింది. రోజుకు గతంలో వెయ్యి రూపాయలు వస్తే, మగవారి ఆటోలు రావడంతో 300 రూపాయలు వచ్చేది కష్టంగా మారింది. ఆదాయం ఒక ఎత్తయితే, నిత్యం మద్యం మత్తులో ఉండే మగవారితో కలిసి స్టాండ్‌ను పంచుకోవడం, సిగిరెట్లు, బీడాలు, పాన్‌పరాగ్‌లు, కిల్లీలు వేస్తున్న వారితో వారి బాధలు వర్ణనాతీతం. మగవారి పెత్తనం భరించలేక స్టాండ్‌ను వదులుకుంటున్నారు. ఒకప్పుడు కేవలం మహిళా డ్రైవర్లు 15 మందితో ప్రారంభించిన ఆటోస్టాండ్ ఇపుడు 40 మందికి చేరింది. అందులో నలుగురు మాత్రమే మహిళలు మిగిలారు. వారికి బాడుగలు ఒకటి రెండు కంటే రాకపోవడం గమనార్హం. మహిళలకే ప్రత్యేకంగా స్టాండులు ఏర్పాటు చేసి, అదుకోవాలని మహిళా డ్రైవర్లు కోరుతున్నారు.

ప్రత్యేక ఆటోస్టాండ్లు కావాలి : మంజుల, ఆటోడ్రైవర్

నాలుగు సంవత్సరాల క్రితం ఆడవారి కోసమే ప్రత్యేకంగా మహిళా ఆటోస్టాండును పెట్టారు. ఇప్పుడు ఇక్కడ ఆరు మందే ఉన్నాం. అందులో రెగ్యులర్‌గా నలుగురు మాత్రమే వస్తుంటారు. మిగిలినోళ్లు రోడ్డుపైనే ఎలాంటి స్టాండులు లేకుండా ప్రయాణీకులను ఎక్కించుకుంటూ వెళుతున్నారు. మాకంటూ ప్రత్యేకంగా ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలి.

కుటుంబ పోషణ భారంగా మారింది : నాగలక్ష్మి, పళణి థియేటర్

నేను 8 సంవత్సరాలుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నాకు ఇద్దరు కూతుళ్లు. పెద్దపాపకు పెళ్లిచేశాను. చిన్న పాపకు అంగవైకల్యం. ఆమెను వైద్యులకు చూపించి, అంగవైకల్య సర్టిఫికెట్ కూడా తీసుకున్నాను. కానీ ఇప్పటి వరకు పాపకు పెన్షన్ కూడా రావడం లేదు. అదేమంటే అధికారులు సాకులు చెబుతున్నారు. ఆటో బాడుగలు కూడా తగ్గిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. పోలీసులు పరిశీలించి, మాకు ప్రత్యేకంగా స్టాండు ఏర్పాటు చేసి, మాకు భద్రత కల్పించాలి.

రూ.300తో ఎలా బతికేది : హారతి, జీవకోన

15 మంది మహిళలు ఉన్న స్టాండులో పురుషులు ప్రవేశించి, ఇప్పుడు స్టాండును 40 మందికి చేర్చారు. మా నోటికాడ కూడును కూడా వారు అడ్డుకోవడం సరైనది కాదు. పెట్రోల్, డీజల్ ధరలు పెరగడంతో మరింత ఇబ్బందులు తప్పలేదు. రోజుకు రూ.300 కూడా గిట్టుబాటు కావడం లేదు. ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ఆటోడ్రైవర్‌గా రాణించేందుకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నాను. అయితే సాటి పురుష డ్రైవర్ల వల్ల మాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బాడుగలు తగ్గిపోయాయి.

స్విమ్స్‌లో మానవ వనరులను పెంచుకోవాలి

12వ స్నాతకోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

స్విమ్స్‌లో రోజురోజుకూ పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా ఆస్పత్రిలో మానవ వనరులను పెంచుకోవాల్సిన అవసరం ఉందని నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ మెడికల్ సైన్సస్ న్యూఢిల్లీ వైస్‌ప్రెసిడెంట్, విశిష్ట ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టరు మినుబాజ్‌పాయ్ స్నాతకోత్సవం ఉపన్యాసం చేశారు. శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ విశ్వవిద్యాలయం(స్విమ్స్ యూనివర్శిటీ) 12వ స్నాతకోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి చాన్సలర్ హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆకాంక్ష మేరకు స్విమ్స్ అభివృద్ధి బాధ్యతను టిటిడి తీసుకుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్స్‌ను అభివృద్ధి చేసేందుకు అనేక సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. దేశంలో అతిపెద్ద హీమోడయాలసిస్ సెంటర్‌తో, శ్రీపద్మావతి మహిళా ఆసుపత్రితో విశిష్టమైన సేవలందిస్తోందని తెలిపారు. డాక్టరు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, డాక్టరు వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా వేలాది మందికి నగదు రహిత వైద్యసేవలు అందిస్తోందన్నారు. మరో ఆరు నెలల్లో రూ.200 కోట్లతో ఏర్పాటు చేసిన శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజి వింగ్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టరు మినుబాజ్‌పాయ్ స్నాతకోత్సవం ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా హాస్పిటల్స్‌లో మానవ వనరులను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత 30 ఏళ్లగా స్విమ్స్ యూనివర్శిటీ వైద్యవిద్య రంగంలో సాగిస్తున్న కృషిని కొనియాడారు. దేశంలో సుమారు 15 లక్షల మంది మెడికల్ స్పెషలిస్టుల కొరత ఉందన్నారు. ప్రభుత్వాలు ఆసుపత్రులను విరివిగా ఏర్పాటు చేసి, ఎంబిబిఎస్, పిజి సీట్లను పెంచుతున్న నేపథ్యంలో స్పెషలిస్టుల కొరత తీర్చడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో 612 మెడికల్ కళాశాలల్లో 91,925 ఎంబిబిఎస్ సీట్లు ఉన్నాయని, సుమారు 2 లక్షల మంది మెడికల్ గ్రాడ్యుయేట్లు నీట్ పరీక్షకు హాజరవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పిజి సీట్లను పెంచి స్పెషలిస్టులను తయారు చేసుకోవాల్సి ఉందన్నారు. టిటిడి ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ స్విమ్స్ హాస్పిటల్ హాస్టల్ విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత బోజన వసతి కల్పిస్తున్నామన్నారు. భవిష్యత్తులో స్విమ్స్‌ను ప్రపంచంలోనే అత్యున్నత స్థాయి సంస్థగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో గత 18 నెలల్లో దాదాపు 1300 గుండె ఆపరేషన్లు డాక్టర్ల సమిష్టి కృషితో విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. అంతకు ముందు స్విమ్స్ విసి డాక్టరు భూమా వెంగమ్మ 12వ స్నాతకోత్సవ నివేదకను సమర్పించారు. అనంతరం ఎంబిబిఎస్, యుజి, పిజి, నర్సింగ్, ఫిజియోథెరపి, పారామెడికల్, డిప్లమా కోర్సులు పూర్తిచేసిన 476 మంది వివిధ విభాగాల విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జేఈవో సదాభార్గవి, స్విమ్స్ డీన్ డాక్టరు అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు రామ్ పాల్గొన్నారు.

'విలువలు' కలిగిన కార్మిక సంఘం 'సిఐటియు'

వెంకటగిరిలో భారీగా పలువురి చేరిక

ప్రజాశక్తి - వెంకటగిరి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం సమక్షంలో వెంకటగిరి సిఐటియులోకి పలువురు నేతలు చేరారు. వెంకటగిరి నియోజకవర్గ కార్మిక నేత చెంగయ్య ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పలు కార్మిక సంఘాల నేతలను, కార్యకర్తలను సిఐటియులోకి జిల్లా నేతలు కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు పట్టణ అధ్యక్షులు ఉదయభాస్కర్ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ సిఐటియు విశిష్టతను వివరించారు. సిఐటియు కార్మిక పోరాటాలకే పరిమితమైంది కాదని, వ్యవస్థ మార్పుకు పోరాడే అత్యున్నతమైన విలువలు కలిగిన కార్మిక సంస్థగా ఆయన వివరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి సిఐటియు తోడ్పడుతున్న తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ ప్రకతి కుమార్ ప్రసంగిస్తూ సిఐటియు కార్యక్రమాలను అభినందించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి మంజుల, సిఐటియు నేతలు స్వరూప రాణి, ఐలా భాస్కర్, మస్తానయ్య, చంద్రశేఖర్‌తో పాటు పలువురు నేతలు ప్రసంగించారు. వెంకటగిరి నియోజకవర్గ కార్మిక నేత చెంగయ్య తో పాటు శ్రీకాంత్, రవి, చెంచమ్మ, లీలావతి, కష్ణయ్య , వెంకటేశ్వర్లు, శీనయ్య ఈశ్వర్, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, మోహన్, సుబ్బయ్య, మణి, సుజన్ సింగ్, మంజుల, సుజాత, రాజయ్య, నరసింహులు, రవీంద్ర తదితరులు సిఐటియులో చేరిన వారిలో ఉన్నారు.

సిఐటియులో భారీగా చేరిన కార్మికులు

'చరిత్ర'ను ఎవరూ చెరపలేరు : సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

బిజెపి వల్ల ముస్లింలకు నష్టం కలుగుతుందని, టిడిపి, బిజెపి ఒకటేనని, రాష్ట్రంలో వైసిపి పాలన ఆశాజనకంగా ఉందని, భవిష్యత్ ఇలానే కొనసాగాలంటే వైసిపినే రావాలని ముస్లిం పెద్దలు సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరి, షేక్ ఖాదర్బాషా, సులేమాన్, కలాంలు రాష్ట్ర పాలక ప్రభుత్వాన్ని కొనియాడారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో వారు మాట్లాడుతూ భారతీయులుగా తాము తమ హక్కులను కోరుకుంటున్నామన్నారు. బిజెపి పాలనలో ముస్లింలకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం జగన్ ముస్లింల పక్షపాతి అని అన్నారు. రానున్న 2023 పాఠశాల పాఠ్యాంశాల్లో ముస్లిం రాజుల పాఠాలను తొలగించారని, దేశవ్యాప్తంగా దీనిపై చర్చ జరుగుతుందన్నారు. చరిత్రను ఎవరూ చెరపలేరని, మోడీ పాలనలో ఎన్ని కుట్రలు చేసినా అంతర్జాలంలో ఇమిడియున్న హిస్టరీని, ప్రచారం చేసే సోషల్ మీడియాను ఎవ్వరూ చెరపలేరన్నారు. హిస్టరీని దాచేయాలనుకున్నా, శాశ్వతంగా గూగుల్‌లో ఉంటుందన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించండి

సులభ్ కార్మికుల పోరాటానికి అఖిలపక్షం మద్దతు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సులభ్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను టిటిడి సానుకూలంగా పరిష్కరించాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. ఐదు రోజులుగా టిటిడి క్వార్టర్స్ గ్రౌండ్‌లో సమ్మెలో ఉన్న సులభ్‌కాంట్రాక్టు కార్మికులకు టిడిపి, సిపిఎం, ఆర్‌పిఐ, ఎంఆర్‌పిఎస్ తరపున సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు నరసింహయాదవ్, ఆర్‌పిఐ దక్షిణ భారత అధ్యక్షులు అంజయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఎంఆర్‌పిఎస్ నాయకులు నరేంద్ర మాట్లాడుతూ ఐదు రోజులుగా కార్మికులు సమ్మెలో ఉంటూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నా టిటిడి యాజమాన్యం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ధర్మాన్ని కాపాడాల్సిన కొండపై కార్మికుల డిమాండ్ల విషయంలో ప్రతిసారీ అధర్మం రాజ్యమేలుతోందన్నారు. భక్తులకు సేవలందించే కార్మికులను చులకనగా చూడటం, బెదిరింపులకు దిగడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. సిఎం జోక్యం చేసుకుని మూడువేల మంది సులభ్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్మికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాల్సిన అధికారులు, బయట నుంచి కార్మికులను సమీకరించి పనులు చేపడతామని చెప్పడం చట్టవ్యతిరేకమన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అఖిలపక్షం తరపున కార్మికులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, వేణు, లక్ష్మి, బుజ్జి, మునిరాజా పాల్గొన్నారు.

ఈవో బెదిరింపులకు పాల్పడటం శోచనీయం

అంతకుముందు యశోదనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. అఖిలపక్షం నేతలు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా, టిటిడి ఈవో బెదిరింపులకు పాల్పడటం శోచనీయమన్నారు. సులభ్ సంస్థవారు ఇఎస్ఐ, పిఎఫ్ కట్టకుండా కార్మికులను దోపిడీ చేస్తుంటే ఈవోకు కనబడలేదా? అని ప్రశ్నించారు. ఎఫ్ఎంఎస్ కార్మికులు పోరాటం చేసి సంవత్సరం అవుతున్నా వారి సమస్యలూ ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. సులభ్ కార్మికులను, ఎఫ్ఎంఎస్ కార్మికులను టిటిడి ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లో కలపాలని డిమాండ్‌చేశారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు పి.అంజయ్య, జనసేన జిల్లా కార్యదర్శి హేమకుమార్, హక్కుల పోరాట కమిటి నాయకులు డిఎంసి భాస్కర్, డివైఎఫ్ఐ నాయకులు ఎస్.జయచంద్ర, ఎం.నరేంద్ర, నాయకులు కె.వేణుగోపాల్, పి.మునిరాజా, పి.బుజ్జి, ఎన్‌డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ: కమిషనర్

తిరుపతి టౌన్ : కార్పొరేషన్ పరిధిలో వీధికుక్కల నియంత్రణకు నిబంధనల మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ హరిత అన్నారు. వీధికుక్కలపై తరచూ ఫిర్యాదులు రావడంతో గురువారం తూకివాకం దగ్గర కుక్కల జనన నియంత్రణ సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కమిషనర్ ఛాంబర్లో సమీక్ష నిర్వహించారు. వీధి కుక్కలను పట్టుకొని జనన నియంత్రణ ఆపరేషన్లు చేయడం, రాబిస్ టీకాలు వేయించడంతో బాటు వాటిని వారం రోజులపాటు డాక్టర్ల పర్యవేక్షణలో సంరక్షించిన తరువాత తిరిగి వాటిని పట్టుకున్న చోటనే విడిచిపెట్టడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, అనిమల్ కేర్ ల్యాండ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొచ్చి వాటర్ మెట్రో ప్రాజెక్ట్‌కు 'శ్రీసిటి' ఉత్పత్తులు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

ఈనెల 25న దేశానికి అంకితం చేస్తూ ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించిన కొచ్చి వాటర్ మెట్రో సూపర్ స్ట్రక్చర్, ఇంటీరియర్‌లను శ్రీసిటీలోని బిఎఫ్‌జి ఇండియా పరిశ్రమ సరఫరా చేసింది. ఇది ఆసియాలోనే మొట్టమొదటి సమగ్ర జలరవాణా వ్యవస్థని ఎండి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. బిఎఫ్‌జి మేడ్ ఎ శ్రీసిటీ ఎఫ్ఆర్‌పి ఉత్పత్తులను కొచ్చి వాటర్ ప్రాజెక్టుతో పాటు ప్రతిష్టాత్మక వందేభారత్ ఎక్స్‌ప్రెస్, ఇతర అనేక మెట్రో ప్రాజెక్టులలో ఉపయోగించడం గర్వకారణమన్నారు.

హద్దురాళ్లు త్వరగా నాటాలి : జేసీ

తిరుపతి టౌన్ : లక్ష్యాల మేరకు జిల్లాలో మొదటి ఫేజ్ రీ సర్వే గ్రామాల్లో హద్దురాళ్లు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జేసీ డికె బాలాజీ ఆదేశించారు. గురువారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. జేసీ డికె బాలాజీ కెవిబిపురం నుంచి పాల్గొన్నారు. జిల్లాలో మొదటిదశకు సంబంధించి 39,322 సర్వే రాళ్లు నాటే లక్ష్యంలో భాగంగా 36,772 సర్వే రాళ్లు నాటే ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాసరావు, ఎడి సర్వే జయరాజ్ పాల్గొన్నారు.

టీటీడీకి రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఒడిశాకు చెందిన శివం కాండేవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు 10 లక్షల వెయ్యి రూపాయల విరాళాన్ని అందించింది. మహతి ఆడిటోరియంలో గురువారం ఆ సంస్థ తిరుపతి ప్రతినిధి రాఘవేంద్ర ఇందుకు సంబంధించిన డీడీని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డికి అందజేశారు.స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ పాల్గొన్నారు.

గంగమ్మ వైభవాన్ని దేశవ్యాప్తం చేయాలి

స్వర కుంభాభిషేకం ఆల్బమ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



శ్రీ తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం వైభవాన్ని దేశవ్యాప్తం చేయాలని ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఏడు పాటలతో రూపొందించిన గంగమ్మ స్వర కుంభాభిషేకం ఆల్బమ్ సీడీని ఆయన ఆవిష్కరించారు. గంగమ్మ స్వర కుంభాభిషేకం ఆల్బమ్ రూపకల్పన వెనుక కిషన్ కృషి ఉందని, బృందంలో సంపత్, జశ్వంత్‌లకు అభినందనలు తెలిపారు. గురువారం భీమాస్ రెసిడెన్సీ హోటల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో మునికృష్ణలతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి గ్రామదేవత తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లి ఆలయమని అన్నారు. గంగమ్మ ఆలయం నుంచే జానపద పండుగ భావస్ఫూర్తి దేశానికి వ్యాపించిందన్నారు. రాయలసీమకే తిరుపతి గంగజాతర తలమానికమన్నారు. ఐదువందల సంవత్సరాల కిందటి నుంచే తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తన చెల్లి గంగమ్మకు సారె సమర్పించే సంప్రదాయం కొనసాగుతోందన్నారు.

డోంట్ స్టాప్ సింగింగ్...పూనకాలు లోడింగే...

స్వర కుంభాభిషేకం ఆల్బమ్ పాటలు అదిరిపోయేలా ఉన్నాయి. 'జాతరో జాతర' అంటూ భూమన కరుణాకర్‌రెడ్డి భక్తి పూర్వకంగా అమ్మవారికి స్వరార్చన చేశారు. 'జగాలు ఏలే తల్లివి' అంటూ ప్రముఖ గాయని మంగ్లీ తన సహజ దోరణిలో వాయిస్ పెంచుతూ పాడిన పాటపై ప్రశంసల జల్లు కురుస్తోంది. డిజే వెహికల్స్ ద్వారా నగరమంతటా ఆల్బమ్ను ప్రజల్లోకి తీసుకెల్లనున్నారు. ఇక జాతరంతా 'డోంట్ స్టాప్ సింగింగ్... పూనకాలు లోడింగే..'లా సందడి చేయనుంది.

దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాలగిరి ప్రతాప్ రెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, హనుమంత నాయక్, రుద్రరాజు శ్రీదేవి, దేవానంధ్, రాజేంధ్ర, కుమార్ పాల్గొన్నారు.

శెట్టిపల్లి భూసమస్యకు శాశ్వత పరిష్కారం

- ప్లాట్ల, రైతులకు భూహక్కు కల్పిస్తున్నాం
- డిప్ పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయింపు
- డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దాదాపు 75 సంవత్సరాలకుపైగా నలుగుతున్న శెట్టిపల్లె భూ సమస్యకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాశ్వత పరిష్కారాన్ని చూపుతున్నామని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి ప్రకటించారు. గురువారం అర్బన్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ రెవెన్యూ అధికారులు, శెట్టిపల్లి ప్లాట్ల కొనుగోలుదారులు, శెట్టిపల్లి గ్రామ రైతులతో శెట్టిపల్లి భూముల వద్ద భూమన అభినయ రెడ్డి మాట్లాడారు. అన్ సెటిల్డ్ విలేజ్ గా ఉన్న శెట్టిపల్లి భూములకు పరిష్కారం కల్పించడానికి గత ప్రభుత్వాలు ఏవీ సాహసించలేకపోయాయని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ల్యాండ్ పూలింగ్ ద్వారా నగరపాలక సంస్థ పరిధిలోకి శెట్టిపల్లిని తీసుకొచ్చి, లబ్ధిదారులకు భూమి హక్కు కల్పించనున్నామన్నారు. దశాబ్దాలుగా శెట్టిపల్లిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికి వ్యయ ప్రయాసలు పడ్డారని, ఇకపై ఈ ఫ్లాట్ లను అభివద్ధి పరుస్తూ రాబోవు రోజుల్లో ఇక్కడ కూడా మాస్టర్ ప్లాన్ రోడ్లను వేస్తామన్నారు. కార్పొరేషన్‌లో నిధులు లేమి కారణంగా ఇప్పటికిప్పుడు పనులు ప్రారంభించ లేకున్నామన్నారు. ఫ్లాట్ల కొనుగోలుదారుల్లో దాదాపు 80 శాతానికి పైగా రికార్డులు క్లియర్ గా ఉండటంతో వారికి డిప్ పద్ధతి ద్వారా ప్లాట్లను అప్పగించడం జరుగుతుందన్నారు. ఇదే తరహాలోనే శెట్టిపల్లి రైతులకూ భూహక్కు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ అభినయ రెడ్డి ఎంతో చొరవ తీసుకొని ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న సమస్యకు కేవలం 15 రోజుల్లో అందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి పరిష్కార మార్గాన్ని చూపారన్నారు. ఫ్లాట్ల కొనుగోలుదారులు ఎటువంటి గందరగోళం లేకుండా డిప్ పద్ధతి ద్వారా ప్లాట్ లను కేటాయించడం శుభపరిణామన్నారు. రాబోవు రోజుల్లో ఈ ప్రాంతం ఓ మోడల్ సిటీగా రూపుదిద్దుకుంటుందంటే అతిశయోక్తి లేదన్నారు. అర్బన్ తాహశీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ ఇన్నాళ్లుగా శెట్టిపల్లె భూ సమస్యకు పరిష్కారం చూపడంలో కోర్టు కేసుల వలన జాప్యం జరిగిందన్నారు. శెట్టిపల్లి భూ సమస్యపై కేసులు వేసిన వారు వెనక్కి తీసుకుంటే మరింత త్వరగా ఆదేశాలు జారీ చేసి లబ్ధిదారులకు మేలు చేసే వెసులుబాటు అధికారులకు కలుగుతుందన్నారు. 20 శాతం ప్లాట్ల కొనుగోలుదారుల్లో ఉన్న సమస్యకు ఓ కమిటీని ఏర్పాటు చేసి, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తిరుపతి నగర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, శెట్టిపల్లి భూపరిరక్షణ కమిటీ నాయకులు రాధాకష్ణ, జి.కష్ణ, ఏ. సురేష్ యాదవ్, ఎన్. శ్రీనివాసులు, నాధముని, హరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



శెట్టిపల్లి భూ బాధితులతో భూమన అభినయరెడ్డి

విద్యార్థుల విజయకేతనం

ఎస్వీ కళాశాలలో మెరుగైన ఉత్తీర్ణత

ప్రజాశక్తి-క్యాంపస్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఎస్వీ జూనియర్ కళాశాల గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించింది. ద్వితీయ సంవత్సరంలో గత సంవత్సరం 27 శాతం సాధిస్తే ఈ సంవత్సరం 353 మందికి గాను 233 మంది పాసై 66 శాతం ఫలితాలు సాధించింది. మొదటి సంవత్సరంలో గత సంవత్సరం 21 శాతం సాధిస్తే ఈ సంవత్సరం 440 మందికి గాను 185 మంది పాసై 42 శాతం ఫలితాలు సాధించింది. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూప్ నుంచి విద్యార్థి సి.వెంకట్ 959 మార్కులు, బైపీసీ నుంచి హేమ వసంత్ 955 మార్కులు, హెచ్ఈసీ నుంచి లక్ష్మీనరసింహ 931 మార్కులు, ధనుష్ నాయక్ 923 మార్కులు, ఎంఈసీ గ్రూప్ నుంచి జి.వెంకట జనార్ద్ 917 మార్కులతో ప్రతిభ కనబరిచారు. మొదటి సంవత్సరంలో ఎంఈసీ నుంచి రాజశేఖర్ 485 మార్కులు, ఎంపీసీ నుంచి ఎస్.పూజాలస్, జి.నందకిషోర్‌లకు 443 మార్కులు, బైపీసీ గ్రూపు నుంచి భరత్ కుమార్ 422 మార్కులు, సీఈసీ గ్రూప్ నుంచి ఆకాష్ 466 మార్కులు, హెచ్ఈసీ నుంచి వివేక్ 468 మార్కులతో ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ ప్రకాష్ బాబు, అధ్యాపక బృందం అభినందించారు.

'శ్రీగాయత్రి' విద్యార్థుల హవా

తిరుపతి సిటీ: ఇంటర్ ఫలితాల్లో శ్రీగాయత్రి ఐఐటి, మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో ఆ కళాశాల కరస్పాండెంట్ నీరజాక్షులు, డైరెక్టర్ పి.కవిత తెలిపారు. స్థానిక బైరాగిపట్టెడలోని ఆ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలోని ఎంపీసీలో వరుసగా 464, 461, 459, 458, 458, 455, 454, 454, 451 మార్కులు, బైపీసీలో అత్యధికంగా 421, 415 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వరుసగా 981, 979, 975, 961 మార్కులతో, బైపీసీలో అత్యధికంగా 970 మార్కులతో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని తెలిపారు. 98 శాతం ఉత్తీర్ణతో తిరుపతిలో తమ కళాశాల అగ్రస్థానంలో నిలిచిందని వివరించారు.

గురుకుల పాఠశాలలో 79 శాతం ఫలితాలు

పుత్తూరు టౌన్: పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ సుమిత్రాదేవి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 79 శాతం ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. 68 మంది విద్యార్థులకు గాను 54 మంది పాసయ్యారని.. అలాగే మొదటి సంవత్సరంలో 66 మంది విద్యార్థులకు గాను 37 మంది పాసయ్యారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎ.తనూజ సీఈసీ విభాగంలో 953 మార్కులు, హెచ్ఈసీలో శ్రవంతి 930 మార్కులు సాధించినట్లు వివరించారు.

పుత్తూరు బాలికల కళాశాల విద్యార్థుల ప్రతిభ

పుత్తూరు టౌన్: ఇంటర్‌లో పుత్తూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ రఘుపతి తెలిపారు. ఇంటర్ ఫలితాలలో సీఎస్ఈలో కన్నమ్మ 985 మార్కులు, బైపీసీలో దివ్య 950 మార్కులు, శిరీష, ఉషశ్రీ 474 మార్కులు, విజయ 474, ఎంపీసీలో జయలక్ష్మి 470 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో 200 మందికి గాను 143 మంది ఉత్తీర్ణత పొంది 71.5 శాతం ఫలితాలను సాధించారని తెలిపారు.

ఏటీన్స్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ ఇంటర్ ఫలితాల్లో తిరుపతి నగర పరిధిలోని ఏటీన్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ మోహనకష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం సీఈసీలో పి. హరిణిశ్రీ 481, యూ. లిఖిత 471, కె. కేతనసాయి 457, ఎంపిసిలో జి.వాహిని 455 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎం.హేమలత 973 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు నరేంద్ర కుమార్, తిరుమలేశ్వర్ నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్లు పూర్ణిమ, హరి, రాజు, శివకృష్ణ పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో తిరుపతి నగర పరిధిలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు అన్నింటా ఉత్తమ ప్రతిభ కనబరిచారని శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సుష్మ నాగేంద్ర తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ కోర్సులో భవిత 465, భువనప్రియ 465, మధునిత్ 465, జూనియర్ బైపీసీ కోర్సులో 440 మార్కులకు గాను సయ్యద్ సోహా 435, నక్షిత్ 434 మార్కులను సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ కోర్సులో యామిని 989, విద్యాధాత్రి 988, ఇందిరా ప్రియదర్శిని 988, దీపిత 988, భవ్యశ్రీ 988 మార్కులను సాధించారన్నారు. అలానే సీనియర్ ఇంటర్ బైపీసీ కోర్సులో 1000 మార్కులకు గాను మోనా 987, హర్ష 986 టాప్ మార్కులను సాధించారన్నారు. అన్ని విభాగాలలో కలిపి 624 మంది విద్యార్థులు 950కి పైగా మార్కులు, 1910 మంది విద్యార్థులు 900 మార్కులకు పైగా సాధించారన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్స్, తిరుపతి శాఖ ఏటీఎం బీవీ ప్రసాద్, డీన్ లు కేఎల్జి ప్రసాద్, రామ మోహన్ రావు, కుమార్, భాస్కర్, కష్ణకుమార్ ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు.

విశ్వసాయి విద్యార్థుల ప్రతిభ

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి బైరాగిపట్టెడలోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఆ కళాశాల డైరెక్టర్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 458 మార్కులతో టి.అనూష ప్రతిభ చాటిందన్నారు. టి.మహేష్ ఫణిభూషణ్, కె.రేష్మితరెడ్డి 457లతో పాటు 450కిపైగా మార్కులు 14 మంది విద్యార్థులు, 400పైగా 82 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో వి.బాష్పిత 432, వి.జ్యోత్న్న 431, ఎ.ప్రశాంత్ 431, ఐ.గాయత్రిదేవి 431 మార్కులు, 400కుపైగా మార్కులను 18 మంది విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో డీజీ రోహిత, జి.రమ్యకృష్ణ, కె.జోషిత 972 మార్కులు సాధించారు. 950 మార్కులకుపైగా 10 మంది, 900లకు పైగా 28 మంది విద్యార్థులు సాధించగా.. బైపిసిలో 961 మార్కులతో ఎస్.తేజస్విని ప్రతిభ చాటింది. సి.చందనరెడ్డి 957, ఎం.ధార్మికరెడ్డి 957, సి.శిరీషా 950 మార్కులతో పాటు 15 మంది విద్యార్థులు 900కుపైగా మార్కులు పొందారు.

ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 'శశి' హవా



తిరుపతి సిటీ: ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో తిరుపతి రూరల్ తనపల్లిలోని శశి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులతో విజయం సాధించారని ఆ కళాశాల సీఈవో ఎన్‌వీజీ ప్రసాద్, డీన్ డాక్టరు ఎన్.హరినాథ్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎస్.అభిషేక్ 464 మార్కులు, టిఎస్ఎన్.రవితే 463, ఐ.యశ్వంత్‌కుమార్ 461, జి.కేశవ చౌదరి 460 మార్కులు, 50 శాతం మంది విద్యార్థులు 400 మార్కులుపైగా సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి రవికుమార్, వైస్ ఛైర్మన్ లక్ష్మీసుప్రియ, డైరెక్టర్లు బూరుగపల్లి కిరణ్‌కుమార్, స్వాతి అభినందించారు.

ఎస్ఆర్ అకాడమి విద్యార్థుల విజయం

తిరుపతి సిటీ: ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఎస్ఆర్ అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభ చూపారని ఆ కళాశాల జోనల్ ఇన్‌ఛార్జి ఎ.రమేష్ తెలిపారు. స్థానిక తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాసపురంలో వద్ద ఉన్న ఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో తమ విద్యార్థి టి.యశ్వంత్‌రెడ్డి 982 మార్కులతో, బైపీసీలో ఎం.రాజేష్ 984 మార్కులతో కళాశాల టాపర్లగా నిలిచారన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో భానుతేజ 463, బైపీసీలో ఎం.మానిశ్రీ 430 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

శ్రీ పద్మావతి విద్యార్థినుల...

క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. భువనేశ్వరి అభినందించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు శైలాబాను బైపీసీలో 979, భవ్యసుధ ఎంపీసీలో 970, కావ్య 970, మౌనిక ఎంఈసీలో 964 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో స్పందన ఎంపీసీలో 449, మంజీర సుధ బైపీసీలో 423, ప్రవల్లిక హెచ్ఈసీలో 484 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ఘనత సాధించిన ప్రిన్సిపల్‌ను, అధ్యాపకులను, విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను టీటీడీ జేఈవో సదా భార్గవి, డీఈవో డాక్టర్ భాస్కర్ రెడ్డి అభినందించారు.

కృష్ణారెడ్డి శ్రీచైతన్య అకాడమి విద్యార్థుల ప్రభంజనం



తిరుపతి సిటీ: ఇంటర్ ఫలితాల్లో తిరుపతి డాక్టర్స్ మెడికల్ అకాడమీ, అమరావతి ఐఐటి అకాడమి, కృష్ణారెడ్డి శ్రీచైతన్య అకాడమి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో ప్రభంజనం సృష్టించారని ఆ కళాశాల ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఎయిర్ బైపాస్‌రోడ్డులోని ఆర్‌టీవో కార్యాలయం ఎదురుగా ఉన్న ఆ కళాశాల ప్రాంగణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440 మార్కులకు తమ విద్యార్థులు పి.శనియఖానం 433, బి.రోషిత 432, ఆర్.కౌషిక 431, ఆర్.వజ్రా 431, ఎంపీపీలో 470 మార్కులకుగాను రష్మిక 464, సి.పవిత్ర 462, కె.మనోజ్‌కుమార్ 462 మార్కులు, సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకు గాను వి.వైష్ణవి 988, మృదుల 986, హేమిక 984 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.



సీనియర్ ఇంటర్ టాపర్ జయశ్రీ

శ్రీకాళహస్తి: రాయలసీమ జూనియర్ కళాశాల విద్యార్థిని జూలుగంటి జయశ్రీ విడుదలైన సీనియర్ ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటింది. సీఈసీ విభాగంలో 1000 మార్కులకు గాను 966 మార్కులు సాధించి శ్రీకాళహస్తి పట్టణంలో టాపర్‌గా నిలిచింది. ఆమెను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇంటర్ ఫలితాల్లో తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్లు విశ్వనాథరెడ్డి, గిరిధర్ రెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీ ఫలితాల్లో తరుణ్ కుమార్ 976, శిరి 973, లావణ్య 973, సీఈసీ కోర్సులో ప్రజన 966 మార్కులు సాధించారన్నారు. అలానే జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంఇసి కోర్సులో రాధిక 485, సిఈసి కోర్సులో కుషి 486 మార్కులు సాధించారన్నారు. మొత్తంగా సీనియర్ ఇంటర్ లో 96.24శాతం, జూనియర్ ఇంటర్ లో 83.78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డైరెక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

పుత్తూరు హిమజ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

పుత్తూరు టౌన్: పుత్తూరు హిమజ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల నిర్వాహకులు సురేంద్రరాజు తెలిపారు. సీఎస్ఈలో రాహుల్ 463 మార్కులు, జాహ్నవి 457, ఎస్ ఎస్ వీణ 411, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ప్రీతి 970, బైపీసీలో వైష్ణవి 970, సీఈసీలో జ్ఞానేష్ 883 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

13న లోక్ అదాలత్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తి కోర్టు సముదాయంలో మే 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమ విజయవంతం పై పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి బేబీ రాణి మాట్లాడుతూ లోక్ అదాలత్ కి కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసుల్లో కక్షిదారులను ఒప్పించి అధిక సంఖ్యలో వాటిని రాజమార్గంలో పరిష్కరించడానికి సమిష్టి కృషి అవసరమని తెలిపారు. అన్ని రకాల క్రిమినల్, సివిల్ కేసులు, క్రిమినల్ కాంపౌండ్ కేసులు, ఎన్ ఐ యాక్ట్ కేసులకు అక్కడికక్కడే సత్వర పరిష్కారం లభిస్తుందని ఆమె చెప్పారు.

నేడు వేదవిశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి -క్యాంపస్: తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం రేపు ఉదయం 11 గంటలకు మహతి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఈ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్, విశ్వవిద్యాలయ కులాధిపతులైనటువంటి గౌరవనీయులు అబ్దుల్ నజీర్ పాల్గొని స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నారు. విశ్వవిద్యాలయ ప్రధాన పరిపోషకులు అయినటువంటి తితిదే పాలకమండలి అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ధర్మారెడ్డి కార్యక్రమంలో పాల్గొననున్నారు. విశ్వవిద్యాలయ ఉప కులపతులు ఆచార్య రాణి సదాశివమూర్తి స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నారు. విశ్వవిద్యాలయం తరపున హైదరాబాదుకు చెందిన బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సలక్షన ఘనపాఠికి ,చెన్నైకి చెందిన బ్రహ్మశ్రీ మణి ద్రావిడ శాస్త్రికి మహాపాధ్యాయ పురస్కారం అన్నవరానికి చెందిన బ్రహ్మశ్రీ కపిలవాయి రామసోమయాజీశర్మ మైసూర్ కి చెందిన బ్రహ్మశ్రీ వంశీకష్ణ ఘనపాఠికి వాచస్పతి సన్మానం చేయనున్నారు సర్టిఫికెట్ కోర్సుల నుంచి పిహెచ్డి దాకా కోర్సులు పూర్తి చేసుకున్న 550 మంది విద్యార్థులకుఈ సందర్భంగా పట్టాలు బహూకరించనున్నారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి 16 సంవత్సరముల కాలంలో వేద ఆగమ పౌరోహిత్య వేదాంగ,వేద భాష్య శాఖలలో ఉన్న 22 విభాగాల తరపున సుమారు 2600 మందికి పైగా విద్యార్థులకు సనాతన పద్ధతిలో విద్యతో పాటు డిగ్రీ ,పీజీ ఎంఫిల్ ,పిహెచ్డి స్థాయిలో డిగ్రీలు ప్రధానం చేయడం జరిగింది. విశ్వవిద్యాలయంలో ఇప్పుటి వరకు చదివినటువంటి విద్యార్థులందరూ పూర్తిస్థాయిలో ఉద్యోగాలలో అర్చకులుగా, పురోహితులుగా, వేద పండితులుగా ,వేద భాష్య పండితులుగా శాస్త్ర పండితులుగా రాష్ట్రంలోనే కాక దేశంలోని వివిధ రాష్ట్రాలలో అలాగే వివిధ దేశాలలో కూడా ఉద్యోగాలు నిర్వర్తిస్తున్నారు.

ఎన్నికలప్పుడు వచ్చిపోయే నాయకుడిని కాదు

'మీ ఇంటికి మీ పులివర్తి నాని'లో పులివర్తి నాని

తిరుపతి అర్బన్ -ప్రజాశక్తి: నా రాజకీయ జీవితం కొనసాగినంత కాలం ప్రజల్లోనే ఉంటా.. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతానని తెలుగుదేశం పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్, చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు పులివర్తి నాని పేర్కొన్నారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమంలో భాగంగా 15వ రోజు సి.మల్లవరం పంచాయితీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పులివర్తి నాని గారు మీడియాతో మాట్లాడారు. 2019లో ఓటమి చెందినా నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ... ప్రభుత్వ ప్రజా వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొంటున్నారని చెప్పారు. 2024లో గెలుపొందిన తర్వాత ఏటా ఇంటి ఇంటికీ తిరిగి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికలప్పుడు వచ్చి రాజకీయాలు చేయడం మా అధినేత నారా చంద్రబాబు నాయుడు నేర్పించలేదన్నారు. క్రమశిక్షణ గల తెలుగుదేశం పార్టీలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. గతంలో జరిగిన చిన్న చిన్న పొరబాట్లు సరిచేసుకున్నామని ఈసారి టీడీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. సి.మల్లవరం పంచాయితీకి చెందిన అధికార పార్టీ నాయకులు సెంటు భూమిని వదలకుండా కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని పర్యటనలో బాధితులు తమ సమస్యలు చెప్పుకుని కన్నీటి పర్యంతమవుతున్నారని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడిన ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కనీసం మురుగు నీటి కాలువల నిర్మాణాలు చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు.

చిన్నగొట్టిగల్లులో 'గడప గడపకు పాదయాత్ర'



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లు మండలంలో గురువారం చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి 'గడప గడపకు పాదయాత్ర' చేపట్టారు. డీసీసీబీ బ్యాంక్ మాజీ ఛైర్మన్ సహదేవరెడ్డి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ఘన స్వాగతం పలికారు. మొదట దేవరకొండ పంచాయతీ నుంచి పాదయాత్రను ప్రారంభించి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లపల్లి, వంగిమల్లువారిపల్లి, కొత్తపల్లి, వెంకటాద్రిపురం, మల్లెలవాండ్లపల్లి, మైలావాండ్లపల్లి, మాదిగపల్లి, మాదేవాండ్లపల్లి, గుట్టావాండ్లపల్లి, బోడిరెడ్డిగారిపల్లి తదితర గ్రామాలలో ఇంటింటికీ పర్యటించారు. ప్రతి ఇంటా హారతులు పట్టి మహిళలు ఆహ్వానం పలికారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేవా.. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ.. వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. అప్పటికప్పుడు వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జట్పీటీసీ స్వరూప, మహేందర్ రెడ్డి, సర్పంచ్ విజయకుమార్, ఉప సర్పంచ్ ప్రదీప్ బాబు, పార్టీ డివిజనల్ అధ్యక్షులు గురుశంకర్, గ్రామ అధ్యక్షులు సుధాకర్, సచివాలయం కన్వీనర్ గిరిబాబు, మండల యూత్ అధ్యక్షులు చంటి, పార్టీ నాయకులు ప్రసాద్, శివ కుమార్ ,పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని మున్సిపాలిటీ గోవిందపాలెంలోని శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 28వ తేదీన శుక్రవారం ఉదయం 16 ప్రముఖ ఎం ఎన్ సి కంపెనీలలోని 1000 పైగా ఐటీ, నాన్ ఐటి ఉద్యోగాలను నియామకం చేయనున్నట్లు కళాశాల ఛైర్మన్ ఉమామహేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మేజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ పి.వెంకట ప్రసాద్ తెలియజేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల లోని ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఎం.బీ.ఏ, యం.సి.ఎ కోర్సులు పూర్తిచేసిన నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అందరికీ అందుబాటులో టీటీడీ కల్యాణ మండపం

ప్రజాశక్తి -సత్యవేడు: పేదలు, కార్మిక కుటుంబాలు, వెనుకబడిన ప్రాంతమైన సత్యవేడు ప్రజలకు అందుబాటులో టిటిడి కల్యాణ మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. గురువారం సత్యవేడు పట్టణం బేరిశెట్టి కల్యాణ మండపం సమీపంలో టిటిడి కల్యాణ మండప నిర్మాణానికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో టిటిడి ఛైర్మన్ వై వి సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గురుమూర్తి, జాయింట్ కలెక్టర్ బాలాజీ, సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, పుత్తూరు ఇన్‌ఛార్జి డీఎస్పి రామ్ రాజ్, నారాయణవనం జడ్పీటీసీ సుమన్ కుమార్, ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి, జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ బాలాజీ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, మంజుల రమేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల ప్రచార నేపథ్యంలో సత్యవేడులో జరిగిన బహిరంగ సభలో ఇక్కడ టిటిడి మండపం నిర్మిస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చడం జరిగిందన్నారు. అయితే టిటిడి మండపం సాధించడంలో ఎమ్మెల్యే ఆదిమూలం కషి ఎంతో ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకే టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలను మంజూరు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. టిటిడి కళ్యాణ మండపం నిర్మాణంతో పేద వర్గాలు అతి తక్కువ ఖర్చుతో శుభకార్యాలు దేవుని సన్నిధిలో జరుపుకున్నట్టు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో దళితులు, గిరిజన ప్రాంతాల్లో ఈ నాలుగు ఏళ్లలో వెయ్యికి పైగా దేవాలయాలను నిర్మించినట్టు ఆయన గుర్తు చేశారు. ఇంకా మరో వెయ్యి దేవాలయాల నిర్మించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇందులో భాగంగానే సత్యవేడు నియోజకవర్గంలో 10 గ్రామాల్లో వెంకటేశ్వర స్వామి దేవాలయాలను నిర్మిస్తున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పరిపాలించే అర్హత లేదని ప్రతిపక్షం అధినేత చంద్రబాబు నాయుడు చెప్పడంపై మండిపడ్డారు. వెన్నుపోటుదారుడు చంద్రబాబు నాయుడును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబుకు కేవలం పదవి దాహం తప్ప రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధి కనిపించదు అని ఎద్దేవా చేశారు.ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ వెనుకబడిన సత్యవేడు ప్రాంతానికి 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు అయిందన్నారు. దీనికి స్థలాన్ని కూడా పాండూరు వద్ద గుర్తించడం జరిగిందన్నారు. శ్రీసిటీలో అనేక పరిశ్రమలు నడుస్తుండటంతో కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా వైద్య సేవ అందే అవకాశాలు ఉందన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద వర్గాల ఆర్థిక అభివద్ధి కోసం రాష్ట్రంలో 28 సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీపీలు రేఖ, దివాకర్ రెడ్డి, పద్మప్రియ, సుబ్బలక్ష్మి, మునిలక్ష్మి, జడ్పిటిసిలు విష్ణు ప్రియ, వెంకటేశ్వర్లు, ప్రతిమ, మునెమ్మ, వైయస్ఆర్సీపీ మండల కన్వీనర్లు హరిచంద్ర రెడ్డి,దయాకర్ రెడ్డి, విద్యానాథ్ రెడ్డి, కిష్టయ్య, భాస్కర్ నాయుడు, ఊరప్ప,హరిబాబు రెడ్డి,హరినాథ్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.